VC NEWS
# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
నిజామాబాద్ శుక్రవారం 13 జూన్ 2025
వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 324
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



3లో..

## హైదరాబాద్‌లో దంచికొట్టిన వర్షం..

# కుప్పకూలిన
## ఎయిర్ ఇండియా విమానం
## 242 మంది ప్రయాణికులు....!
# విహంగ విస్ఫోటం





అహ్మదాబాద్‌లో కుప్పకూలిన ఎయిరిండియా విమానం 265 మంది మృతి
అందులోని 229 మంది ప్రయాణికులు.. 12 మంది సిబ్బంది దుర్మరణం
వైద్యకళాశాల సముదాయంపై పడటంతో మరో 24 మంది మృత్యువాత
మృతుల్లో గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపాణీ
విమానం నుంచి ప్రాణాలతో బయటపడింది ఒక్కరే
లండన్‌కు బయల్దేరిన నిమిషాల్లోనే దుర్ఘటన

2లో..

## డ్రీమ్‌లైనర్ విమానాల భద్రతపై అనుమానాలు
## ఉత్పత్తి..నాణ్యతలపై పలు సందేహాలు

## విమాన ప్రమాదం.. నేడు అహ్మదాబాద్‌కు ప్రధాని మోదీ



ఎయిరిండియా విమాన ప్రమాదం నేపథ్యంలో ప్రధాని మోదీ అహ్మదాబాద్‌లో పర్యటించనున్నారు. అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిరిండియా విమానం గురువారం ఘోర ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే . ఈ ప్రమాదంలో 241 మంది ప్రయాణికులు, సిబ్బంది చనిపోయారు. వైద్య కళాశాల సముదాయంపై విమానం కూలిన నేపథ్యంలో మరో 24 మంది మృతి చెందారు. ఈ ఘటన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ శు క్రవారం అహ్మదాబాద్‌లో పర్యటించనున్నారు.


విమాన ప్రమాదంపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎక్స్ వేదికగా ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రయాణికులు, సిబ్బంది కుటుంబాల కోసం ప్రార్థిస్తున్నట్టు వెల్లడించారు.ప్రమాదంపై కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ తీవ్ర విచారం ప్రకటించారు. క్షతగాత్రులకు అందిస్తున్న వైద్య సేవల గురించి ఆరా తీస్తున్నట్లు కిషన్‌రెడ్డి, సంజయ్ పేర్కొన్నారు. వారు త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. విమాన ప్రమాదం పట్ల భారాస అధినేత కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ఆదుకోవాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆయన కోరారు. ప్రమాదంపై భారాస సీనియర్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు సంతాపం తెలిపారు.

## మృత్యుంజయుడు విశ్వాస్‌కుమార్
### విమాన ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడ్డ విశ్వాస్ కుమార్ రమేశ్



విమానంలో 11-ఏ సీటులో కూర్చొన్న విశ్వాస్‌కుమార్ రమేశ్ అనే ప్రయాణికుడు అనూహ్యరీతిలో ప్రాణాలతో బయటపడ్డారు. గుజరాత్‌లో ఉన్న తన కుటుంబాన్ని కలిసేందుకు బ్రిటన్ నుంచి విశ్వాస్ రాగా.. తిరుగు ప్రయాణంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదం అనంతరం రక్తపుమరకలతో నడుచుకుంటూ వచ్చి ఆయన అంబులెన్సు ఎక్కారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర విభాగంలో చికిత్స అందిస్తున్నారు.






## రూపాణీ మృదుస్వభావి

అహ్మదాబాద్: గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదంలో మరణించిన మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపాణీ మృదు స్వభావి. విశ్వసనీయ నేతగా ఆయనకు పేరుంది. ముఖ్యమంత్రిగా పాలనలో ఆయన తనదైన ముద్ర వేశారు. రాజ్యసభ సభ్యుడిగానూ సేవలందించారు. అంతకుముందు కార్పొరేటర్‌గానూ, మేయర్‌గానూ, గుజరాత్ మంత్రిగానూ పని చేశారు. రూపాణీకి భార్య అంజలి, కుమారుడు రుషబ్, కుమార్తె రాధిక ఉన్నారు. మరో కుమారుడు పూజిత్ రూపాణీ గతంలో జరిగిన ఓ ప్రమాదంలో మరణించారు. 68 ఏళ్ల విజయ్ రూపాణీ అసలు పేరు విజయ్‌భాయ్ రామ్‌నిక్‌లాల్‌భాయ్ రూపాణీ. ఆయన 1956 ఆగస్టు 2వ తేదీన మయన్మార్‌లోని యాంగూన్‌లో జన్మించారు. చిన్నప్పుడే ఆయన కుటుంబం రాజ్‌కోట్‌కు తరలివచ్చింది. పాఠశాల రోజుల్లోనే ఆయన ఆరెస్సెస్‌పట్ల ఆకర్షితులయ్యారు. రాజ్‌కోట్‌లోని ధర్మేంద్రసిన్హ్‌జీ ఆర్ట్స్ కళాశాలలో చదువుకున్నారు. బీఏతోపాటు ఎల్‌ఎల్‌బీ చదివారు. కళాశాలలో చదువుకునే రోజుల్లో ఏబీవీపీలో చేరి విద్యార్థి నేతగా ఎదిగారు. అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు.

## యావత్ దేశం దిగ్భ్రాంతి




ఎయిరిండియా విమానం కుప్పకూలిన దుర్ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అహ్మదాబాద్‌లో ఆస్పత్రులకు వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. అనంతరం ఆయన గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్, కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో కలిసి మీడియాతో మాట్లాడుతూ ఈ దుర్ఘటనపై ప్రకటన చేశారు."ఎయిరిండియా-171 విమానం కూలిపోయింది. ఈ ప్రమాదంలో పలువురు ప్రయాణికులు మరణించారు. అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంపై యావత్ దేశం దిగ్భ్రాంతికి గురైంది. విమానంలో 230మంది ప్రయాణికులు ఉన్నారు. 12మంది సిబ్బంది ఉన్నారు. విమాన ప్రమాదం నుంచి ఒకరు క్షేమంగా బయటపడినట్లు తెలిసింది. అతడిని కలిశాను. మృతుల గురించి తెలుసుకొనేందుకు డీఎన్‌ఏ పరీక్షలు చేస్తున్నాం. డీఎన్‌ఏ టెస్టులు చేశాకే మృతుల గురించి ప్రకటిస్తాం" అన్నారు.మృతుల కుటుంబాలకు టాటా గ్రూప్ కోటి పరిహారం"ఘటన జరిగిన వెంటనే గుజరాత్ సర్కార్ వేగంగా స్పందించింది. ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించాను. ప్రమాద సమయంలో విమానంలో 1.25 లక్షల లీటర్ల ఇంధనం ఉంది. విమానం పేలిన వెంటనే మంటలు వ్యాపించాయి. మంటలు వ్యాపించడంతో ఎవరినీ కాపాడే పరిస్థితిలేకుండా పోయింది" అని అమిత్ షా వివరించారు.



## కెసిఆర్, కిషన్ రెడ్డి ఎప్పటికీ ఒక్కటి కాదు

బిజెపి,రేవంత్ రెడ్డి మాత్రమే ఒక్కటే
మోడీ ప్రాపకం కోసం రేవంత్ తంటాలు
ఢిల్లీలో రాహుల్ అపాయింట్‌మెంట్ కోసం పడిగాపులు
మాజీమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శలు

2లో..



2లో..

## హైదరాబాద్‌లో వారసత్వ కట్టడాల వద్ద మెట్రో పనులపై హైకోర్టు స్టే

నగరంలో మెట్రో రెండో దశ పనుల్లో భాగంగా వారసత్వ కట్టడాలైన చార్మినార్, ఫలక్‌నుమా ప్యాలెస్ సమీపంలో ఎలాంటి పనులు చేపట్టరాదని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.



2లో..

## ఆదిలాబాద్ జిల్లాలో పిడుగుపాటు
### వేర్వేరు ప్రాంతాల్లో ఆరుగురు మృత్యువాత

## తెలంగాణలో భారీగా ఐఎఎస్‌ల బదిలీ

36మందిని బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శిగా ఎన్ శ్రీధర్
ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా నవీన్ మిట్టల్
హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా హరిచందన దాసరి

2లో..



## క్వారీ గుంతలో పడి ఇద్దరు చిన్నారుల మృతి
### తల్లిదండ్రుల కన్నీరుమున్నీరు

మేడ్చెల్:మేడ్చల్ జిల్లా జవహర్ నగర్ పరిధిలోని అరుంధతి నగర్ లో విషాదం చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు క్వారీ గుంతలో పడి ఇద్దరు చిన్నారులు మృతిచెందారు. మృతి చెందిన చిన్నారులు దుర్గా ప్రసాద్ (11), సుబ్రహ్మణ్యం(8)గా గుర్తించారు పోలీసులు. చిన్నారులు అరుంధతి నగర్ లో వుండే బంధువుల ఇంటికి వచ్చారు. నిన్న మధ్యాహ్నం ఇంటి నుంచి ఆడుకునేందుకు వెళ్లారు. ప్రమాదవశాత్తు క్వారీ గుంతలో పడి శవాలుగా తేలడంతో తీవ్ర విషాదం చోటు-చేసుకుంది. అయితే చిన్నారుల కోసం కుటు-ంబ సభ్యులు వెతకగా ఆచూకీ లభించలేదు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు చిన్నారుల కోసం వెతకడం ప్రారంభించారు. ఈ క్రమంలో క్వారీ గుంతవైపు వెళ్లిన కొందరు వ్యక్తులు చిన్నారుల మృతదేహాలు నీటిలో తేలియాడడం చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరు చిన్నారులు క్వారి గుంతలో శవాలుగా తేలడంతో కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

వేగుచుక్క

# విహంగ విస్ఫోటం



గగనంలో ఘోరం.. గుజరాత్‌లోని అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయల్దేరిన ఎయిరిండియా బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ విమానం గురువారం కుప్పకూలి మంటల్లో దగ్ధమైంది.

అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్ సమీపంలోని మేఘానీనగర్‌లో ఉన్న బీజే వైద్య కళాశాల వసతి గృహంపై కూలిన విమానం

అహ్మదాబాద్: గగనంలో ఘోరం.. గుజరాత్‌లోని అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయల్దేరిన ఎయిరిండియా బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ విమానం గురువారం కుప్పకూలి మంటల్లో దగ్ధమైంది. మధ్యాహ్నం 1.38 గంటలకు టేకాఫ్ అయిన విమానం ఇంకా విమానాశ్రయానికి దగ్గర్లో ఉన్నప్పుడే ఏదో సమస్య తలెత్తడంతో పైలట్లు పూర్తిస్థాయి అత్యవసర పరిస్థితిని ప్రకటించే 'మేడే కాల్' ఇచ్చారు. అది అకస్మాత్తుగా కిందికి దిగిపోవడం మొదలైంది. పైలట్లతో సంప్రదించడానికి గగనతల రద్దీ నియంత్రణ (ఏటీసీ) విభాగం ప్రయత్నించినప్పటికీ స్పందన రాలేదు. తిరిగి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకునేందుకు ప్రయత్నించిన ఏఐ171 విమానం.. అత్యంత తక్కువ ఎత్తుకు వచ్చి, కొన్ని సెకన్లలోనే విమానాశ్రయ వెలుపల మేఘానీనగర్‌లో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది నివాస ప్రాంతం వద్ద కూలిపోయింది. అగ్నిగోళాన్ని తలపించేలా మంటలు చెలరేగాయి. దట్టమైన నల్లని పొగలు అలముకున్నాయి. దుర్ఘటన జరిగినప్పుడు విమానంలో 230 మంది ప్రయాణికులు, ఇద్దరు పైలట్లు సహా 12 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో ఒక్క ప్రయాణికుడు గాయాలతో బయటపడగా మిగిలినవారంతా ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపాణీ (68) కూడా ఉన్నారు. లండన్‌లో ఉంటున్న తన కుమార్తెను చూసేందుకు ఆయన వెళ్తున్నప్పుడు ఈ దుర్ఘటన జరిగింది.

మెడికోలు సహా పౌరులపై మృత్యుపంజా

విమానం కూలిన ప్రాంతంలోని బీజే వైద్య కళాశాల మెడికోల వసతి గృహ సముదాయం బాగా ధ్వంసమై, 24 మంది మృత్యువాత పడ్డారని భావిస్తున్నారు. వారిలో ఎక్కువమంది మెడికోలు. మృతుల సంఖ్యను అధికారికంగా బయటపెట్టలేదు. ప్రమాద దృశ్యాన్ని మొబైల్ ఫోన్లో ఒకరు రికార్డు చేయగా అది నిమిషాల్లో వైరల్ అయింది. ప్రమాదంపై రాష్ట్రపతి, ప్రధాని సహా పలువురు ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. 'విమాన ప్రమాదాల దర్యాప్తు మండలి' (ఏఏఐబీ) ద్వారా విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు హుటాహుటిన ప్రమాద స్థలికి చేరుకుని సహాయక చర్యలు పర్యవేక్షించారు. మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోయాయి. దీంతో డీఎన్‌యే పరీక్ష ద్వారా వాటిని గుర్తించి, కుటుంబ సభ్యులకు అప్పగించాలని నిర్ణయించినట్లు అమిత్ షా చెప్పారు. రాత్రి పొద్దుపోయే సమయానికి 265 మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అహ్మదాబాద్‌లో లోహ విహంగాలు ఇంత భారీ ప్రమాదానికి గురికావడం ఇది రెండోసారి. 1988 అక్టోబరు 19న ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం ఈ విమానాశ్రయంలో దిగుతూ కుప్పకూలగా దానిలో ఉన్న 130 మందీ మృత్యువాత పడ్డారు.ఇలా టేకాఫ్ అయిన కొద్దిసేపటికే విమానం కూలిపోవడంతో చెలరేగిన మంటలుఅనంతరం అలముకున్న పొగ625 అడుగుల ఎత్తులో ఉండగా.. 'ఫ్లైట్ రాడార్ 24' ప్రకారం లండన్ విమానం 625 అడుగుఎత్తులో ఉండగా ఏటీసీతో సంబంధాలు తెగిపోయాయి. మధ్యాహ్నం 1.39 సమయంలో పూర్తిగా కిందికి దిగిపోతూ మొదట ఓ చెట్టును ఢీకొన్నట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. విమానంలో ఒక భాగం ఓ ఐదంతస్తుల భవంతిని ఢీకొట్టింది. ఆ సమయంలో పేలుడులాంటి శబ్దం వినిపించిందని, అప్పుడే విమానానికి, భవనానికి మంటలు అంటుకున్నాయని ప్రత్యక్ష సాక్షి తెలిపారు. ఈ బోయింగ్ డ్రీమ్ లైనర్‌లో 300 మంది ప్రయాణించవచ్చు. ఇది 11 ఏళ్లుగా సేవలు అందిస్తోంది. 6,817 కిలోమీటర్ల ప్రయాణం కావడంతో విమానంలో 1,25,000 లీటర్ల పైచిలుకు ఇంధనం ఉంది. దీనికి మంటలు అంటుకోవడంవల్ల ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉందని, విపరీతమైన వేడి కారణంగా ఇంకెవరూ ప్రాణాలతో మిగిలే అవకాశం లేదని అమిత్‌షా చెప్పారు. దుర్ఘటనలో మరికొన్ని భవనాలూ దెబ్బతిన్నాయి. కొన్నింటికి మంటలు వ్యాపించాయి. కార్లు సహా పలు వాహనాలు కాలిపోయాయి. ఘటనా స్థలానికి అగ్నిమాపక శకటాలు, ఎన్డీఆర్ఎఫ్ బలగాలను తరలించారు. మృతుల కుటుంబ సభ్యులను అహ్మదాబాద్‌కు తీసుకువెళ్లేందుకు దిల్లీ, ముంబయి నుంచి ఒక్కో ప్రత్యేక విమానాన్ని ఎయిరిండియా ఏర్పాటు చేసింది.

రూ.కోటి చొప్పున పరిహారం

ప్రమాద ఘటనపై ఎయిరిండియా ఛైర్‌పర్సన్, టాటా సన్స్ గ్రూపు ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఒక్కో కుటుంబానికి రూ.కోటి చొప్పున పరిహారం చెల్లిస్తామని ప్రకటించారు. "ప్రమాద ఘటన తీవ్రంగా కలచివేసింది. ఆ బాధను వ్యక్తపరచడానికి మాటలు కూడా రావడం లేదు. ప్రమాదంలో ప్రియమైనవారిని కోల్పోయిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి. ఈ విషాదంలో ప్రాణాలు కోల్పోయిన ప్రతి వ్యక్తి కుటుంబానికి గ్రూపు తరఫున రూ.కోటి చొప్పున అందజేయనున్నాం. గాయపడిన వారి వైద్య ఖర్చులను కూడా మేమే భరిస్తాం. వారి సంరక్షణ బాధ్యత కూడా మాదే. బీజే మెడికల్ హాస్టల్ నిర్మాణానికి మా వంతుగా తోడ్పాటు అందిస్తాం" అని చంద్రశేఖరన్ పేర్కొన్నారు.విమాన ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడ్డ విశ్వాస్ కుమార్ రమేశ్‌పైలట్‌కు సుదీర్ఘ అనుభవం ప్రమాదానికి గురైన విమానానికి కెప్టెన్‌గా సుమిత్ సబర్వాల్, ఫస్ట్ ఆఫీసర్‌గా క్లైవ్ కుందర్ వ్యవహరించినట్లు పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) తెలిపింది.

# కెసిఆర్, కిషన్ రెడ్డి ఎప్పటికీ ఒక్కటి కాదు

**హైదరాబాద్:** గల్లీలో గలీజ్ దందాలు చేస్తూ ఢిల్లీలో గులాం గిరి చేస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తీరు ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో వేముల ప్రశాంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో చిట్ చాట్ చేశారు. మంత్రుల శాఖల కేటాయింపు కోసం, కాంగ్రెస్ పార్టీ అధినేతల అపాయింట్‌మెంట్ కోసం రెండు రోజులు ఢిల్లీలో పడిగాపులు కాసి అపాయింట్‌మెంట్ దొరకని ఫ్రస్టేషన్‌లో మాట్లాడుతున్నాడు. కేసీఆర్, కిషన్ రెడ్డి ఒక్కటే అని రేవంత్ రెడ్డి అన్న మాట అబద్ధం, అవాస్తవం. రేవంత్ రెడ్డి బీజేపీ ఒక్కటి అన్నది వాస్తవం. రేవంత్ రెడ్డి ,బీజేపీ దోస్తాన్ చాలా సార్లు బయట పడింది. లోక్‌సభ ఎన్నికల్లో బలహీన అభ్యర్థులను పెట్టి బీజేపీ ఎంపీలు గెలవడానికి రేవంత్ రెడ్డి సహాయ పడ్డారు. స్వయంగా ఈ మాట బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. మల్కాజ్‌గిరిలో ఈటల రాజేందర్‌ను గెలిపించడానికి వేరే ప్రాంతం నుంచి సునీతా మహేందర్ రెడ్డిని నిలబెట్టారు. కిషన్ రెడ్డిని గెలిపించడానికి బీఆర్ఎస్‌లో ఉన్న దానం నాగేందర్‌ని సికింద్రాబాద్‌లో నిలబెట్టారు. కాంగ్రెస్ నుండి గతంలో కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థిగా పలుమార్లు పోటీ- చేసిన అనుభవం ఉన్న జీవన్ రెడ్డికి కాదని ప్రత్యక్ష రాజకీయాలతో సంబంధం లేని వెలిచాల రాజేందర్‌కు కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌పై



పోటీకి నిలిపారు. ఇలా నిజామాబాద్‌లో అరవింద్‌పై, మెదక్‌లో రఘునందన్‌పై, ఆదిలాబాద్‌లో నగేశ్‌లపై రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి బలహీన అభ్యర్థులను నిలబెట్టారు. 8 మంది బీజేపీ ఎంపీలలో 7 మందిని రేవంత్ రెడ్డినే గెలిపించారు. బీజేపీ పార్టీ కూడా రేవంత్ రెడ్డిపై ఈగ వాలనివ్వడం లేదు అని వేముల ప్రశాంత్ రెడ్డి గుర్తు చేశారు.

స్వయంగా ప్రధాని మంత్రి మోదీ ఎలక్షన్ ప్రచారంలో తెలంగాణలో ఆర్ ఆర్ ట్యాక్స్ నడుస్తుంది అని మాట్లాడిన ఈడి, సీబీఐ ఎందుకు రావడం లేదు..? ఓటుకు నోటు కేసు ఎటుపోయింది, ఎందుకు జాప్యం జరుగుతోంది..? రేవంత్ రెడ్డి ఢిల్లీకి పోయినప్పుడు రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ దొరకదు కానీ ప్రధానిని కలవడానికి 15 నిమిషాల్లో అపాయింట్‌మెంట్ ఎలా దొరుకుతుంది..? బండి సంజయ్ బహిరంగంగానే రేవంత్ రెడ్డి పదవి కాపాడుకోవాలని సూచనలు ఇస్తున్నాడు. బీఆర్ఎస్‌ను రాజకీయంగా బొంద పెట్టడానికి కాంగ్రెస్, బిజెపి కలిసి పని చేయాలి అని బండి సంజయ్ అన్నారు. బీజేపీ కాంగ్రెస్ ఒక్కటే అనే సంకేతం బండి సంజయ్ ఇచ్చారు. రేవంత్ రెడ్డి బీజేపీలో జాయిన్ అయితే స్వాగతిస్తామని ఎంపీ అరవింద్ అంటు-న్నారు. ఇది రేవంత్ రెడ్డి, బీజేపీ దోస్తానకు సంకేతము కాదా..? నేను బీజేపీ స్కూల్‌లో చదువుకున్న అని రేవంత్ రెడ్డి ఢిల్లీలో అన్నారు. హైదరాబాద్‌లో అన్నది మోదీ విన్నాడో లేదో అని మళ్ళీ అవే మాటలు ఢిల్లీలో మాట్లాడిండు. బీజేపీలోకి వెళ్తాను అని సూచన ఇస్తున్నట్టు-న్నాడు. కాంగ్రెస్ పార్టీ వాళ్ళు రేవంత్ రెడ్డిని నమ్మకండి.. కాంగ్రెస్ పార్టీని ఖతం చేసి బీజేపీలోకి పోతారు అని ప్రశాంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ తెలంగాణకు ఆత్మ. తెలంగాణ కోసం కేసీఆర్ పోరాడుతున్న సందర్భంలో ఉద్యమకారులపైకి తుపాకీ ఎక్కు పెట్టిన రేవంత్ రెడ్డి తెలంగాణకు శత్రువు. ఏపీకి చంద్రబాబు నీళ్లు తీసుకెళ్తుంటే నోరు ముసుకున్న రేవంత్ రెడ్డి తెలంగాణ శత్రువు. కేసీఆర్ హయాంలో తలసరి ఆదాయంలో దేశంలో మొదటి స్థానంలో ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని 4వ ప్లేస్‌కు, జీడీపీలో 4వ స్థానంలో ఉన్న రాష్ట్రాన్ని 13వ స్దానానికి దిగజార్చిన నువ్వు తెలంగాణ శత్రువు. తెలంగాణ అప్పుల పాలైందని, తెలంగాణ ముఖ్యమంత్రిగా వెళ్తే దొంగలా చూస్తున్నారని తెలంగాణ పరువు తీస్తున్న రేవంత్ రెడ్డి తెలంగాణకు శత్రువు అని ప్రశాంత్ రెడ్డి ధ్వజమెత్తారు. బీజేపీ, కాంగ్రెస్ కలిసి తెలంగాణకి అన్యాయం చేస్తున్నారు.

# ఆదిలాబాద్ జిల్లాలో పిడుగుపాటు

### వేర్వేరు ప్రాంతాల్లో ఆరుగురు మృత్యువాత

ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లాలో పిడుగుపాటు ఆరుగురు రైతలను బలితీసుకుంది. వేర్పవేరు ప్రాంతాలో పిడుగపాటు కారణంగా మొత్తం ఆరుగురు మృతి చెందారు. విత్తనాలు వేయడానికి వెళ్లిన సమయంలో పిడుగు పడడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. అకాల వర్షం ఆరుగురు రైతులను పొట్టనబెట్టుకుంది. రెండు రోజులుగా అడపాదడపా కురిసిన వర్షాలతో విత్తనాలు వేసేందుకు సిద్ధమైన రైతుల కుటుంబాల్లో విషాదం నింపింది. ఏజెన్సీలోని గాదిగూడ మండలం పిప్పిరిలో 14 మంది రైతులు వ్యవసాయ కూలీలతో కలిసి మొక్కజొన్న విత్తులు వేసే క్రమంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వచ్చింది. వర్షం నుంచి రక్షణ కోసం పొలంలోనే ఉన్న కర్రలతో ఏర్పాటు చేసిన గుడిసెలోకి అందరు వెళ్లారు. అదే సమయంలో గుడిసెపై పిడుగు పడింది. ఈ ఘటనలో పెందూర్ మాదర్రావు(45), సంజ(22), మంగం భీంబాయి (40), సిడాం రాంబాయి (45) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన 10 మందిని తొలుత ఝరి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి ఆ తరువాత రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

## హైదరాబాద్‌లో వారసత్వ కట్టడాల వద్ద మెట్రో పనులపై హైకోర్టు స్టే

హైదరాబాద్: నగరంలో మెట్రో రెండో దశ పనుల్లో భాగంగా వారసత్వ కట్టడాలైన చార్మినార్, ఫలక్‌నుమా ప్యాలెస్ సమీపంలో ఎలాంటి పనులు చేపట్టరాదని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రాంతంలో మెట్రో పనులపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. వారసత్వ కట్టడాల పరిరక్షణపై ఎలాంటి అధ్యయనం లేకుండా వాటి సమీపంలో హైదరాబాద్ మెట్రో రైల్వే ప్రాజెక్ట్ రెండో దశలో భాగంగా కారిడార్-6 పనులు చేపట్టడాన్ని సవాలు చేస్తూ యాక్ట్ పబ్లిక్ వెల్ఫేర్ ఫౌండేషన్.. హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ యారా రేణుకలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది.మెట్రో రెండో దశ పనుల కారణంగా వారసత్వ కట్టడాలైన చార్మినార్, ఫలక్‌నుమాతో పాటు పలు కట్టడాల రక్షణకు ప్రమాదం పొంచి ఉందని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఈ మార్గంలో పురాణి హవేలి, దారుల్‌షిఫా మసీద్, మొగల్పూరా టూంబ్ తదితర నిర్మాణాలున్నాయన్నారు. వారసత్వ కట్టడాలపై పడే ప్రభావంపై అధ్యయనం చేయకుండా పనులు చేపట్టడం చెల్లదన్నారు. హెరిటేజ్ రక్షణ నిపుణులు, పట్టణ ప్రణాళికా విభాగం నిపుణులు, పర్యావరణ నిపుణులతో పాటు కమ్యూనిటీ నిపుణులతో కూడిన స్వతంత్ర కమిటీతో అధ్యయనం చేయించాలని కోరారు. తెలంగాణ వారసత్వ కట్టడాల రక్షణ చట్టంతో పాటు కేంద్ర పురావస్తు శాఖ చట్టం నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకున్నాకే పనులను కొనసాగించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అప్పటివరకు చారిత్రక కట్టడాల సమీపంలో మెట్రో రైల్వే పనులను నిలిపి వేసేలా ఆదేశాలు జారీచేయాలని కోరారు. పూర్తి వివరాలతో కౌంటరు దాఖలు చేయడానికి మూడు వారాల గడువు ఇవ్వాలని ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ కోరారు.

# తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీ

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం భారీగా ఐఏఎస్‌లను బదిలీ చేసింది. 36 మంది ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శిగా ఎన్ శ్రీధర్‌ను నియమించింది. గనుల శాఖ ముఖ్య కార్యదర్శిగా ఆయనకు అదనపు బాధ్యతలు కట్టబెట్టింది. ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా నవీన్ మిట్టల్‌ను బదిలీ చేసింది. ఇక ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శిగా జ్యోతి బుద్ధ ప్రకాష్‌ను నియమించింది. ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా శశాంక్ గోయల్‌ను బదిలీ చేసింది. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శిగా లోకేష్ కుమార్‌ను నియమించింది. ఆయనకు చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఏ) చీఫ్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా హరిచందన దాసరిని నియమించింది. తెలంగాణ ఆయిల్‌ఫెడ్ ఎండీగా జె.శంకరయ్యను నియమించింది. తెలంగాణ భవన్ ముఖ్య కార్యదర్శిగా గౌరవ్ ఉప్పల్ బదిలీ చేసింది. సమాచార కమిషన్ సెక్రటరీగా భారతీ లకపతినాయక్‌ను నియమించింది. హన్మకొండ జిల్లా కలెక్టర్‌గా స్నేహ శబరీష్, నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌గా టి.వినయ్ కృష్ణారెడ్డిని బదిలీ చేసింది. రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ స్పెషల్ సెక్రటరీగా రాజీవ్‌గాంధీ హనుమంతును నియమించింది.

స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా ఈ నవీన్ నికోలస్‌ను బదిలీ చేసింది. ఆర్ అండ్ ఆర్ కమిషనర్‌గా కె. శివకుమార్ నాయుడును నియమించింది. ఇక సాధారణ పరిపాలన శాఖ సంయుక్త కార్యదర్శిగా చిట్టెం లక్ష్మిని బదిలీ చేసింది. జి. సృజనకి మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. వ్యవసాయ, సహకారశాఖ సంయుక్త కార్యదర్శిగా ఎల్. శివశంకర్‌ను నియమించింది.

వేగుచుక్క

# మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి.

## కమీషనర్ కు సిఐటియు, టియుసిఐ, ఎఐటియుసి నాయకులు వినతి పత్రం.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జూన్ 12:**



మున్సిపల్ కార్పొరేషన్ లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని టియుసిఐ, సిఐటియు, ఏఐటియుసి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్ కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ బాబు, టీయుసీఐ జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.సుధాకర్, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి వై. ఓమయ్య లు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల పారిశుద్ధ్య కార్యక్రమం పేరుతో మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న కార్మికులతో ఆదివారం, పండగ సెలవులు కూడా ఇవ్వకుండా పనిచేయిస్తున్నారన్నారు. ఒకవైపు వర్షాలు కురుస్తుండడం, తగిన పనిముట్లు, భద్రతా పరికరాలు లేకపోవడంతో పారిశుద్ధ్య కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సెలవులు లేకుండా విధులు నిర్వహిస్తున్న కార్మికులు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. కార్మికులకు పనిముట్లు, రైన్ కోట్లు గ్లౌజులు, బూట్లు ఇవ్వలేదన్నారు. పర్మినెంట్ కార్మికులతో పాటు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు కూడా అన్ని రకాల పనిముట్లు, భద్రత పరికరాలు అందివ్వాలన్నారు. మున్సిపల్ కార్మికులందరికీ ఐడీ కార్డులు ఇవ్వాలన్నారు. డిమాండుకు సరిపడా కార్మికుల సంఖ్య లేకపోవడంతో కార్మికులపై అధిక పనివారం పడుతుందన్నారు. వెంటనే ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. స్పందించిన కమిషనర్ ఆదివారం, పండగ సెలవులు అమలు చేస్తామని, ఐడి కార్డులు, పనిముట్లు కార్మికులందరికీ త్వరలోనే అందజేస్తామని, మిగతా సమస్యలు కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నరసింగరావు నాయకులు ఫిరోజ్ అలీ పాల్గొన్నారు.

# రక్తదానంతో ప్రాణాలు కాపాడాలి.

**- రాష్ట్ర సర్జన్స్ సంఘం ప్రెసిడెంటు ఎలెక్ట్ డా. జీవన్ రావు.**



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జూన్ 12**

: రక్తదానంతో ప్రాణాలు కాపాడాలనీ రాష్ట్ర సర్జన్స్ సంఘం ప్రెసిడెంటు ఎలెక్ట్ డా. జీవన్ రావు అన్నారు. జూన్ 15 న నేషనల్ సర్జన్స్ డే పురస్కరించుకుని, సర్జన్స్ వారొత్సావాల్లో భాగంగా ది అసోసియేషన్ సర్జన్స్ ఆఫ్ ఇండియా, ఐఎంఏ, నిజామాబాద్ సంయుక్తంగా గురువారం నగరంలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హాల్లో రక్త దాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సర్జన్స్ సంఘం ప్రెసిడెంట్ ఎలెక్ట్ డా. జీవన్ రావ్, ఏఎస్ఐ జిల్లా అధ్యక్షులు డా. టి. నరేంద్ర మాట్లాడుతూ, రక్తం మనకు దేవుడిచ్చిన వరమని, ఇది శరీరంలో ఉత్పత్తి అవుతుందన్నారు. రక్తదానం అతి గొప్ప ప్రాణదానంతో సమానమన్నారు. ప్రమాదాలు, రక్త స్రావాలు, గర్భిణీలకు ఆపరేషన్ చేసినప్పుడు సరైన గ్రూపు రక్తం దొరకక చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారనీ అన్నారు. కావున ఆరోగ్యంతులైన 18 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల యువతీ యువకులు ప్రతిఒక్కరూ ధనిక, పేద అనే తేడా లేకుండా ముందుకొచ్చి రక్తదానం చేస్తె ఒక నిండుప్రాణాన్ని కాపాడినవారవుతరని పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు ముందుకొచ్చి రక్తదాన శిబిరాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యులు భాస్కర్ రెడ్డి, రాకేశ్, రాజేశ్, శ్రీశైలం, రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ శ్రీ.అంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట రాజశేఖర్, డా. శంతన్, డా. శ్రీలత, డొనర్స్ మహేశ్, సునీల్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలి.

## జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, జూన్ 12:**



ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన, గుణాత్మక విద్య అందిస్తున్నామని, తల్లిదండ్రులు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. సదాశివ నగర్ మండలం అడ్లూరు ఎల్లారెడ్డి హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో జరిగిన పేరెంట్స్ మీటింగ్ లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, మధ్యాహ్న భోజన పథకం, రెండు జతల యూనిఫారం లు, పాఠ్యపుస్తకాలు నోట్ పుస్తకాలు అందిస్తున్నామని అన్నారు. దాతల సహకారం తో పాఠశాలలో రంగులు వేయించడం పూర్తి చేయడం జరిగిందని, సామాజిక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంలో గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, ప్రముఖ శాస్త్రవేత్త ఎల్లారెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్, మండల విద్యాధికారి యోసేఫ్ , జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి వేణుగోపాల్, వయోజన విద్య ప్రాజెక్ట్ అధికారి వెంకటేశ్వర రావు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు. ఇదే గ్రామం లోని ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల లలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు విద్యార్థులకు ఉచిత యూనిఫారం, పాఠ్య పుస్తకాలు మరియు నోటు పుస్తకాలు అందజేశారు.

# నిజామాబాద్ జిల్లా ఇంచార్జీ మంత్రిగా "సీతక్క".

**వేగుచుక్క న్యూస్:నిజామాబాద్**



జిల్లా ఇంచార్జ్ మంత్రిగా రాష్ట్ర అటవీ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క నియమితు లయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిజామాబాద్ ఉమ్మడి జిల్లాకు మంత్రి పదవి ఎవరికీ దక్కలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావ్ కు జిల్లా ఇంచార్జ్ మంత్రి పదవిని అప్పగించారు. ఇటీవల రెండో విడత మంత్రివర్గ విస్తరణలో ఉమ్మడి జిల్లాకు స్థానం దక్కలేదు అయితే రాష్ట్రంలో పలు జిల్లాలకు ఇంచార్జ్ మంత్రులను మార్చగా ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రిగా ఉన్న సీతక్కకు నిజామాబాద్ జిల్లా బాద్యతలను అప్పగించారు.

# రక్తదానం ప్రాణదానంతో సమానం.

## ప్రముఖ చాతీ వైద్య నిపుణులు డాక్టర్ బొద్దుల రాజేంద్రప్రసాద్.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జూన్ 12:**





రక్తదానం ప్రాణదానంతో సమానమని ప్రముఖ చాతీ వైద్య నిపుణులు డాక్టర్ బొద్దుల రాజేంద్రప్రసాద్ అన్నారు. రక్తదానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆయన సూచించారు.
లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ ఆధ్వర్యంలో నిజామాబాదు నగరంలోని రెడ్ క్రాస్ లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 15 మంది క్లబ్ సభ్యులు, యువకులు రక్తదానం చేశారు. అనంతరం డాక్టర్ బొద్దుల రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, రక్తదానం పట్ల అపోహాలు ఉన్నాయని అందులో నిజం లేదన్నారు. ఆరోగ్య వంతులైన వారు ప్రతి మూడు నెలలకోసారి రక్తదానం చేయవచ్చన్నారు. లయన్స్ లాంటి స్వచ్ఛంద సంస్థలు రక్తదానం పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మెన్ బుస ఆంజనేయులు, కార్యదర్శి అరుణ్ బాబు, కోశాధికారి కరిపె రవీందర్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎ. లింబాద్రి, జిల్లా అదనపు కార్యదర్శి పి. లక్ష్మినారాయణ, కోశాధికారి పి. రాఘవేందర్, పీఆర్వో చింతల గంగాదాస్, డైరెక్టర్ పొలాస సత్యనారాయణ, ప్రోగ్రాం చైర్మెన్ అంకం రాజేందర్ పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో దంచికొట్టిన వర్షం..



## రహదారులు జలమయం

**నగరంలోని వివిధ ప్రాంతాల్లో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది.**

హైదరాబాద్: నగరంలోని వివిధ ప్రాంతాల్లో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఉరు ములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడటం తో లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. హయత్ నగర్, ఉప్పల్, కోఠి, తార్నాక, సికింద్రాబాద్ బంజారాహిల్స్, అమీర్‌పేట, సనత్ నగర్ తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి పలు చోట్ల ట్రాఫిక్ జామ్ అయింది. రహదారులపై భారీగా వరదనీరు నిలిచిపోవడంతో వాహన దారులు ఇబ్బంది పడ్డారు.నైరుతి రుతుపవనాలు చురుగ్గా ఉండటంతో మరో ఐదు రోజుల పాటు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

# యూపీఐ లిమిట్ రూ.5 లక్షలకు పెంపు..




యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా సెక్యూరిటీల మార్కెట్లో చెల్లింపులు చేసేందుకు కొత్త వ్యవస్థను తీసుకొస్తామని సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా తెలిపింది. సురక్షితంగా, సమర్థవంతంగా చెల్లింపులు చేసేందుకు, మోసగాళ్ల నుంచి చట్టబద్ధమైన ఆర్థిక ఇంటర్మీడియరీలను వేరు చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. యూపీఐ చెల్లింపుల పరిమితిని రూ. 5 లక్షలకు పెంచనున్నట్లు తెలిపింది. ఆ వివరాలు తెలుసుకుందాం.

ప్రస్తుతం దేశీయ డిజిటల్ చెల్లింపుల్లో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)దే అగ్రస్థానం. నిత్యం కోట్లల్లో ట్రాన్సాక్షన్లు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సెక్యూరిటీల్లో పెట్టుబడులు పెట్టేందుకు సైతం యూపీఐ అనుమతించారు. అయితే, యూపీఐ ద్వారా మోసాలు పెరుగుతున్న క్రమంలో సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. సెక్యూరిటీల మార్కెట్‌లో చెల్లింపులు సురక్షితంగా, సమర్థవంతంగా ఉండేందుకు, మోసగాళ్ల నుంచి ఇంటర్మీడియరీలను వేరు చేసేందుకు కొత్త వ్యవస్థను తీసుకొస్తామని తెలిపింది. తమ వద్ద నమోదు చేసుకున్న ఆర్థిక ఇంటర్మీడియరీల కోసం ప్రత్యేక యూపీఐ అడ్రస్ రూపొందించాలనుకుంటున్నట్లు తెలిపింది. ఇలా చేయడం ద్వారా ఇన్వెస్టర్లు నమోదిత కంపెనీలకు మాత్రమే చెల్లిస్తున్నామని సులభంగా నిర్ధారించుకునేందుకు అవకాశం లభిస్తుందని సెబీ తెలిపింది. క్యాపిటల్ మార్కెట్ ట్రాన్సాక్షన్ల కోసం యూపీఐ పేమెంట్ల పరిమితిని రోజుకు రూ. 5 లక్షలకు పెంచాలనుకుంటున్నట్లు పేర్కొంది. ప్రస్తుతం ఈ పరిమితి రోజుకు రూ. 2 లక్షలుగా ఉంది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా తో చర్చలు జరిపి తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. ఈ ప్రతిపాదనలపై సంప్రదింపుల పత్రాన్ని విడుదల చేసింది. ఫిబ్రవరి 21వ తేదీలోగా ప్రజల నుంచి అభిప్రాయాలు కోరింది.

మార్కెట్లో చెల్లింపులకు యూపీఐ విధానాన్ని 2019 లో తొలిసారి అందుబాటు లోకి తీసుకొచ్చింది సెబీ. అయితే, యూపీఐ చెల్లింపుల ద్వారా మోసాలు ఎక్కువయ్యాయి. పలు నమోదు కాని కంపెనీలు ఇన్వెస్టర్లను తప్పుదారి పట్టించి, మోసపూరితంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు గుర్తించింది. ఈ సమస్య రోజు రోజుకు పెరుగుతుండడంతో పరిష్కరించేందుకు ప్రతి నమోదిత ఇంటర్మీడియరీ కోసం ప్రత్యేక ఆల్ఫాన్యూమరిక్ యూపీఐ ఐడీ రూపొందించాలని సెబీ ప్రతిపాదించింది. సరైన ఇంటర్మీడియరీకే యూపీఐ పేమెంట్లు చేరినట్లు నిర్ధారించుకునేందుకు వీలుపడుతుందని తెలిపింది. నిర్ధారణ కోసం పచ్చ రంగు త్రికోణాకారంలో, థమ్స్ అప్ చిహ్నాన్ని పంపుతారు. ఇలా త్రికోణాకారం, థమ్స్ అప్ గుర్తులు రాలేదంటే అనధికార సంస్థకు చెల్లింపులు చేసినట్లు నిర్ధారించుకోవాల్సి ఉంటుంది.

వేగుచుక్క



మత్తెక్కించేస్తున్న శాలిని పాండే


శాలిని పాండే తరవాత పెద్దగా సినిమాల్లో కనిపించలేదు. బాలీవుడ్‌లో మాత్రం అవకాశాలు దక్కించుకుంటోంది. ఈ మధ్య ఈ అమ్మడు తన ఎక్స్‌పోజింగ్‌తో కుర్రకారును మత్తెక్కిస్తోంది. తాజాగా శాలిని ఫోటోలు హాట్‌హాట్‌గా మారాయి.

# కుబేర నుంచి డుండుం పాట విడుదల




నాగార్జున, ధనుష్, రష్మిక మందన్న కాంబినేషన్‌లో టాలీవుడ్ సెన్సిబుల్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'కుబేర'. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మాతలు. జూన్ 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచిన మేకర్స్ ఇప్పటికే విడుదల చేసిన పాటలు, గ్లిమ్స్ టీ-జర్ మూవీపై అంచనాలను రెట్టింపు చేశాయి. ఈనేపథ్యంలో ఈ చిత్రం నుంచి పీపీ డుండుండుం అంటూ కథానాయిక రష్మికపై చిత్రీకరించిన వీడియో సాంగ్‌ను మేకర్స్ బుధవారం ఉదయం విడుదల చేశారు. చైతన్య పింగళి సాహిత్యం అందించిన ఈ పాటను మంగ్లీ సోదరి ఇంద్రావతి చౌహాన్ ఆలపించగా రాక్‌స్టార్ దేవీశ్రీ ప్రసాద్ సంగీతం సమకూర్చాడు. ఈ పాట వింటుంటే మరో హిట్ అవడమే గాక సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంటుందని నెటిజన్లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# ఉస్తాద్ రెగ్యులర్ షూటింగ్




ఇటీవలే 'హరిహర వీరమల్లు' చిత్రం డబ్బింగ్ పనులు ముగించారు పవన్ కల్యాణ్. ఇప్పుడు ఆయన 'ఉస్తాద్ భగత్‌సింగ్' చిత్రం సెట్స్‌లోకి అడుగుపెట్టారు. ఈ చిత్రం తాజా షెడ్యూల్ మంగళవారం హైదరాబాద్‌లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో మొదలైంది. పవన్‌కల్యాణ్‌తో పాటు- ఇతర తారాగణంపై కీలక సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు. నెల రోజుల పాటు ఈ షెడ్యూల్ సాగనుంది. ఈ చిత్రంలో పవన్‌కు జోడీగా శ్రీలీల నటిస్తున్నారు. గతంలో పవన్‌కల్యాణ్‌తో 'గబ్బర్‌సింగ్' లాంటి బ్లాక్‌బస్టర్‌ను తెరకెక్కించిన హరీశ్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీస్థాయిలో నిర్మిస్తున్నారు. సంగీతం: దేవి శ్రీ ప్రసాద్, సినిమాటోగ్రఫీ: అయనంక బోస్. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, డైరెక్టర్ హరీష్ శంకర్, మైత్రి మూవీ మేకర్స్ సెన్సేషనల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చాలాకాలంగా పెండింగ్‌లో ఉంది. పవన్ ఎంట్రీతో సెట్స్‌లో జోష్ నెలకొంది. పవన్ కళ్యాణ్‌తో పాటు- సినిమాలోని ప్రముఖ తారాగణం కూడా షూటింగ్‌లో పాల్గొంటోంది. నవీన్ యెర్నేని, వై.రవి శంకర్ భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ సినిమాలో శ్రీలీల కథానాయికగా నటిస్తోంది. ఈ చిత్రానికి రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. రామ్-, లక్ష్మణ్ ద్వయం యాక్షన్ సీక్వెన్స్‌లను కొరియోగ్రఫీ చేస్తున్నారు.



# రిలీజ్‌కురెడీ అయిన నిశ్శబ్ద

మనోజ్ కుమార్, ఆశిత రెడ్డి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా నిశ్శబ్ద చిత్రాన్ని శ్రీరిషి సాయి ప్రొడక్షన్ బ్యానర్‌పై శ్రీనివాస్, ఎం.సంధ్యారాణి నిర్మిస్తున్నారు. హారర్ థ్రిల్లర్ కథతో దర్శకుడు రమణమూర్తి తంగెళ్లపల్లి రూపొందిస్తున్నారు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న నిశ్శబ్ద సినిమా త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. మంగళవారం నిర్మాత శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా చిత్ర టీజర్ ను హైదరాబాద్‌లో ఘనం గా రిలీజ్ చేశారు. అనంతరం చిత్రబృందం కేక్ కట్ చేసి నిర్మాత శ్రీనివాస్ బర్త్ డే సెలబ్రేషన్స్ జరిపారు. ఈ కార్యక్రమంలో యువ హీరోలు కృష్ణ, సంజయ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మాత శ్రీనివాస్ మాట్లాడుతూ 'నిశ్శబ్ద టీజర్ అందరికీ నచ్చిందని ఆశిస్తున్నా.సినిమా కూడా అంతే బాగుంటు-ంది. త్వరలోనే మా మూవీని థియేటర్స్ లోకి తీసుకొస్తాం. ఇంకా నాలుగైదు ఆసక్తికరమైన మూవీస్ మా ప్రొడక్షన్ నుంచి రాబోతున్నాయి. ప్రస్తుతం ఆ చిత్రాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి'అని అన్నారు. డైరెక్టర్ రమణమూర్తి తంగెళ్లపల్లి (శపశశపషసషతా ÷ుశగ్గ!÷శూశె) మాట్లాడుతూ 'నిశ్శబ్ద చిత్రాన్ని హారర్‌గా థ్రిల్లర్ తెరకెక్కిస్తున్నాను. ఈ సినిమా చేసే క్రమంలో ప్రొడ్యూసర్ శ్రీనివాస్ ఎంతో సపోర్ట్ అందించారు . అందరి ఆదరణతో 'నిశ్శబ్ద' సినిమా త్వరలోనే థి యేటర్స్‌లోకి వచ్చి మంచి విజయాన్ని సాధిస్తుందని ఆశిస్తున్నా'అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ని ర్మాత ఎం. సంధ్యారాణి, హీరో మనోజ్ కుమార్, హీరోయిన్ ఆశితరెడ్డి, సూర్య, నాగలక్ష్మిపాల్గొన్నారు.

# న్యూ ఏజ్ లవ్ స్టోరీ 'సయారా'



యష్ రాజ్ ఫిలిమ్స్ బ్యానర్ మీద మోహిత్ సూరి తెరకెక్కిస్తున్న న్యూ ఏజ్ లవ్ స్టోరీ 'సయారా'.ఈ మూవీతో అహాన్ పాండే తెరకు పరిచయం కాబోతోన్నారు. ఈ సినిమాలో అనీత్ పద్దా హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇటీవల రిలీజ్ చేసిన 'సయారా' టీజర్, టైటిల్ సాంగ్ అందరినీ ఆకట్టుకుంది. ఇదొక న్యూ ఏజ్ లవ్ స్టోరీ అని, నేటి ట్రెండ్‌కి, యూత్‌ని అద్దం పట్టేలా ఉందని టీజర్ చూస్తే అర్థం అవుతుంది. తాజాగా సయారా నుంచి రెండో పాటను రిలీజ్ చేశారు. 'బర్బాద్' అంటూ సాగే ఈ పాటను యంగ్ సెన్సేషన్ జుబి న్ ఆలపించారు. ఈ పాటకు ది రిష్ సాహిత్యా న్ని అందించడమే కాకుండా బాణీని సమకూర్చారు. ఇక ఈ రొమాంటిక్ లవ్ సాంగ్ కోసం జుబిన్‌ను ఎంచుకోవ డానికి ప్రత్యేక కారణం ఉందని దర్శకుడు మోహిత్ తెలిపారు. ఈ మేరకు మోహిత్ మాట్లాడుతూ.. 'ప్రేమ పాట ల్ని పాడేందుకు ప్రతీ తరంలో ఓ గాయకుడు పుట్టు-కొస్తారు. ఈ తరానికి జుబిన్ అలాంటి ఓ గ్రేట్ సింగర్. సయారా ఆల్బమ్‌లో జుబిన్ ఒక ఫీల్ గుడ్ రొమాంటిక్ ట్రాక్ పాడాలని నేను అనుకున్నాను. నేను బర్బాద్ ట్యూన్ విన్నప్పుడు జుబిన్ గాత్రం సరిగ్గా సరిపోతుందని భావించాను. ఆయన గొంతులో ఇలాంటి రొమాంటిక్ లవ్ సాంగ్స్ ఇంకా ఎక్కువ ప్రభావాన్ని చూపిస్తాయి. సయారా -టైటిల్ ట్రాక్‌కి మాకు లభించిన అద్భుతమైన స్పందన తర్వాత మళ్లీ ఇలా 'బర్బాద్'ను తీసుకు వస్తున్నాం. ఈ పాటకి కూడా ఆడియెన్స్ నుంచి మంచి స్పందన వస్తుందని ఆశిస్తున్నాము'అని అన్నారు. ఈ మూవీని జూలై 18న భారీ ఎత్తున రిలీజ్ చేయబోతోన్నారు.

# లేడీ డాన్‌గా అనుష్క



కార్తీ హీరోగా లోకేష్ కనగరాజ్ దర్వకత్వంలో రాబోయే 'ఖైదీ 2' పట్టాలెక్కడానికి ఇంకొన్ని నెలలు సమయం పడుతుంది. ఖైదీ, విక్రమ్, లియో చిత్రాలకు ముడి పెడుతూ ఖైదీ 2 ఉంటుందట. దీనిలో భాగంగా సినిమాలో చాలా పాత్రలు అదనంగా ఉంటాయి. అయితే ఖైదీ 2 చిత్రంలో అందమైన లేడీ భామల్ని కూడా రంగంలోకి దించుతున్నట్లు- సమాచారం. దీనిలో భాగంగా స్వీటీ అనుష్క ఈ చిత్రంలో లేడీ డాన్ పాత్రలో కనిపించబోతుందని కోలీవుడ్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. అయితే లోకేష్ సినిమాలో డోస్ పరిమితిని మించి ఉంటు-ంది. పాత్ర రగ్గడ్‌గా..రఫ్‌గా ఉంటుంది. ఆ విషయంలో లోకేష్ ఎక్కడా రాజీ పడడు. అందుకోసం అనుష్క అదనంగా కష్టపడాల్సి ఉంటు-ంది. లోకేష్ డెన్‌లోకి ప్రవేశిస్తే అనుష్క కెరీర్ కూడా కొత్త టర్నింగ్ తీసుకుంటుంది.





# బన్నీ కథతో..ఎన్టీఆర్ సినిమా
## రూట్ మార్చిన దర్శకుడు త్రివిక్రమ్

ప్రస్తుతం గత కొన్నిరోజులుగా త్రివిక్రమ్ తరువాతి ప్రాజెక్ట్స్ గురించే చర్చ నడుస్తోంది. పుష్ప 2 తరువాత అల్లు అర్జున్,. త్రివిక్రమ్‌తో ఒక సినిమా చేయాల్సి ఉంది. డైనమిక్ ద్యూ అనే పేరుతో బన్నీ - త్రివిక్రమ్ సినిమాను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు కూడా. ఇక పుష్ప 2 తరువాత.. బన్నీ, అట్లీ సినిమాను ఓకే చేయడంతో పాటు పట్టాలు కూడా ఎక్కించేశాడు. అట్లీ- సినిమా అవ్వడానికి దాదాపు ఏడాది పడుతుంది. ఈలోపు గురూజీ.. ఎప్పటినుంచో వెంకటేష్ తో ఒక సినిమా చేయాలనుకుంటున్న విషయం తెల్సిందే. ఇప్పుడు ఆ సినిమాను పట్టాలెక్కించి పనిలో ఉన్నాడు. ఇక ఇది కాకుండా రామ్ చరణ్ తో కూడా మరో సినిమాను ప్లాన్ చేస్తున్నాడు. ఇప్పటికే చరణ్ కు కథ వినిపించడం, ఆయన ఓకే చెప్పడం కూడా జరిగిందట. అయితే చరణ్ తో సినిమా అనేసరికి.. అది బన్నీకి వినిపించిన కథనే అని టాక్ నడిచింది. అందుతున్న సమాచారం ప్రకారం.. చరణ్ కు గురూజీ చెప్పిన కథ బన్నీది కాదట. అది పూర్తిగా వేరని తెలుస్తోంది. ఇక బన్నీకి చెప్పిన కథను త్రివిక్రమ్.. ఎన్టీఆర్ కు చెప్పడానికి రెడీ అయ్యినట్లు- తెలుస్తోంది. అట్లీ- సినిమా తరువాత అయినా త్రివిక్రమ్ సినిమాకు బన్నీ గ్రీన్ సిగ్నల్ ఇస్తాడా అనే నమ్మకం లేదు. దీంతో బన్నీతో సినిమాను క్యాన్సిల్ చేసుకొని ఆ కథను ఎన్టీఆర్ తో చేయాలని చూస్తున్నాడని టాక్. మైథలాజికల్ జోనర్ కాబట్టి.. ఎన్టీఆర్ బాగా సెట్ అవుతాడని, ఈ కథకు ఎన్టీఆర్ కూడా ఓకే చెప్పేలా ఉన్నాడని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఎన్టీఆర్ త్రివిక్రమ్ కాంబోలో అరవింద సమేత లాంటి హిట్ పడింది. ఇప్పుడు ఈ కాంబో రిపీట్ అవుతుంది. ఈ ఏడాదిలోనే గురూజీ.. వెంకటేష్ మూవీని పట్టాలెక్కిస్తాడు. అది వచ్చే ఏడాదికి రిలీజ్ అవుతుంది. దీని తరువాత చరణ్ మూవీ. ఒకవేళ చరణ్ కనుక బిజీగా ఉంటే.. ఎన్టీఆర్ మూవీని సెట్స్ మీదకు తీసుకెళ్లనున్నాడట త్రివిక్రమ్. ఇంకోపక్క ఎన్టీఆర్ .. వార్ 2 ను ముగించి ప్రశాంత్ నీల్ సినిమాతో బిజీగా ఉన్నాడు. ఈ సినిమా కూడా వచ్చే ఏడాదిలోపు పూర్తి అవుతుంది. ఎన్టీఆర్ కనుక గ్రీన్ సిగ్నల్ ఇస్తే.. వచ్చే ఏడాదిలోనే ఈ సినిమా పట్టాలెక్కేస్తోంది. మరి ఎన్టీఆర్- త్రివిక్రమ్ కాంబో రిపీట్ అవుతుందో లేదో చూడాలి.